క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

షాబాద్: మండల పరిధిలోని చిన్నసోలిపేట్, పెద్దసోలిపేట్, చందనవెల్లి గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని షాబాద్ విద్యుత్ ఏఈ కోటేశ్వర్ రావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. చందనవెల్లి ఫీడర్ 11 కేవీ, సోలిపేట్ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ అంతరాయం ఉంటుందని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

చేవెళ్ల: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని సామ రంగారెడ్డి అన్నారు. మండల పరిధిలోని దేవునిఎర్రవల్లిలో ఆదివారం ఆయన సొంత ఖర్చుతో మల్లన్న ఆలయం చుట్టూ సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా దాత రంగారెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలోని ఆలయాల అభివృద్ధికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సామ మానిక్యరెడ్డి, గ్రామస్తులు బక్కయ్య, చంద్రయ్య, శ్రీనివాస్, రాములు, శ్రీశైలం, సుధాకర్‌రెడ్డి, రాజిరెడ్డి, మల్లారెడ్డి, రాంరెడ్డి, రాములు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో చలివేంద్రం



గ్రామస్తులకు తాగునీరు అందిస్తున్న నిర్వాహకులు

కేశంపేట: ప్రయాణికులకు, గ్రామస్తులకు వేసవిలో తాగునీటిని అందించాలనే లక్ష్యంతో మండల పరిధిలోని కొత్తపేటలో పాలాది శ్రీనివాస్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం ఆయన గ్రామస్తులతో కలసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామస్తులకు, ప్రయాణికులకు అనుకూలంగా ఉండేలా బస్టాండ్ అవరణలో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటుచేసినట్లు శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తట్టెపల్లి నరసింహ, శ్రీకాంత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లన్న బోనాలు



బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న నాయకులు

కొందుర్గు: మండల కేంద్రంలో ఆదివారం మల్లన్న స్వామి కల్యాణం, బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాడిబావి ఆంజనేయ స్వామి వారి ఆలయం నుంచి మల్లన్న స్వామి దేవాలయం వరకు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బోనాల ఉత్సవాల్లో పోతురాజుల నృత్యాలు, శివసత్తుల పూనకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

నీటి దానం మహాదానం

మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



అంజయ్య యాదవ్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

షాద్‌నగర్: నీటి దానం మహాదానమని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద బీఆర్‌ఎస్ నాయకుడు కొండె మల్లేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని అంజయ్య యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమాన్ని నాయకులు నారాయణరెడ్డి, ఈట గణేష్, కొందూటి నరేందర్, కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్, కానుగు అంతయ్య, చెట్ల జంగయ్య, ఆంజనేయులు, మంగ శ్రీశైలం, మల్లేష్, సుధాకర్, రాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కాగితాలపైనే ప్లాస్టిక్ నిషేధం

- విచ్చలవిడిగా విక్రయాలు
- కొరవడిన నియంత్రణ
- పేరుకుపోతున్న వ్యర్థాలు



ఇళ్ల మధ్య పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

కొత్తూరు: ప్రజల ఆరోగ్యాలను దెబ్బతియడం.. భూతాపం పెరగడంతో పాటు పలు విపత్తులకు కారణమయ్యే నాణ్యత లేని పాలిథీన్(ప్లాస్టిక్) ఉత్పత్తులపై ప్రభుత్వం విధించిన నిషేధం మూణాళ్ల ముచ్చటగా మారింది. ప్లాస్టిక్ ఉత్పత్తుల వల్ల జరిగే అనర్థాలను గుర్తించిన సామాజిక వేత్తలు, పర్యావరణ వేత్తల చైతన్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణ పరిరక్షణలో భాగంగా నాణ్యత లేని పాలిథీన్ కవర్లు, ఇతర ఉత్పత్తుల వాడకాలను పూర్తి స్థాయిలో నిషేధించాలని ఆదేశాలు జారీ చేశాయి. దీంతో ఆరంభంలో ఆయా శాఖలకు చెందిన అధికారులు ఒకటిరెండు రోజులు హడావిడి చేసి విస్తృత ప్రచారం నిర్వహించారు. మున్సిపాలిటీలో పలుమార్లు తనిఖీలు నిర్వహించి విక్రేతలకు జరిమానాలు సైతం విధించారు. తర్వాత పట్టించుకోకపోవడంతో తిరిగి వీటి వాడకం పెరిగిపోయింది. దీంతో మూరుమూల గ్రామాల్లోనూ ఖాళీ స్థలాల్లో పాలిథీన్ ఉత్పత్తులు పెద్ద ఎత్తున పేరుకుంటున్నాయి.

అధికారులపై ఆరోపణలు

కొత్తూరు మున్సిపాలిటీ, మండలంలోని అనుబంధ గ్రామాలు, గిరిజన తండాల్లోనూ నాణ్యత లేని పాలిథీన్ కవర్లు, ఇతర ఉత్పత్తుల విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు మొదలుకొని హోటళ్లు, అల్పాహార, కిరాణ, కురగాయాలు, పండ్లు, ఇతర చిరు దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్ల వాడకం పెరిగిపోతోంది. 40 మైక్రాన్ల కంటే తక్కువగా ఉన్న పాలిథీన్ సంచులను తయారు చేయడం.. ఉపయోగించడాన్ని గతంలో ప్రభుత్వం నిషేధించింది. సంచుల నాణ్యతను గుర్తించే యంత్రాలు లేకపోవడం.. సంబంధిత శాఖ అధికారుల అలసత్వం కారణంగా వ్యాపారులు వీటిని విచ్చలవిడిగా వాడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పాలిథీన్ సంచులను తయారు చేసే, విక్రయించే వారికి నోటీసులు ఇచ్చి అధికారులు చేతులు దులుపుకొంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మండలంలో రోజుకు సగటున 50 నుంచి 80 కిలోల వరకు వీటి విక్రయం సాగుతోంది. గ్రామాల్లోని పలు కాలనీల్లో వాడి పాడేస్తున్న కవర్లను కొందరు ఇళ్ల సమీపంలోనే కాల్చుతున్నారు. దీంతో సమీపంలోని ఇళ్లలోకి విషపూరితమైన పొగ వ్యాపించి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ప్రజలు వాపోతున్నారు.

అవగాహన కల్పించాలి



గ్రామాల్లో నాణ్యతలేని పాలిథీన్ ఉత్పత్తులను విక్రయించకుండా వ్యాపారులకు.. వినియోగించకుండా ప్రజలకు తరచుగా అవగాహన కల్పించాలి. నిబంధనలు పట్టించుకోని వ్యాపారులపై ఒకటి రెండు సార్లు చర్యలు తీసుకుంటే సాధ్యమైనంత వరకు అరికట్టే వీలుంది.

– సురేష్, గూడూరు

జూట్ బ్యాగుల వాడకం మేలు



పాలిథీన్ బ్యాగుల వాడకం తగ్గాలంటే జూట్ (జనుముతో చేసిన) బ్యాగులను మార్కెట్‌లోకి తీసుకురావాలి. డిమాండ్‌కు తగిన సరఫరా ఉండాలి. ప్రజలు సైతం ఒకసారి కొనుగోలు చేసిన బ్యాగులను పారవేయకుండా తిరిగి వినియోగించే పాత పద్ధతిని కొనసాగించాలి. అప్పుడే పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ వినియోగం తగ్గిపోతుంది.

– నాగరాజుచారి, కొత్తూరు



మొయినాబాద్: ఈస్టర్ వేడుకల్లో యువతుల ప్రదర్శన

భక్తిశ్రద్ధలతో ఈస్టర్



కొందుర్గు: క్రైస్తవుల ర్యాలీ

మొయినాబాద్: ఈస్టర్ వేడుకలను క్రైస్తవ సోదరులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని మెథడిస్ట్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చిలుకూరు, పెద్దమంగళారం, అజీజ్‌నగర్, నాగిరెడ్డిగూడ తదితర గ్రామాల్లోని చర్చిల్లో ఏసుక్రీస్తు జనన ఇతివృత్తాంతాన్ని స్మరించుకున్నారు. ఏసుక్రీస్తు మరణించి పునరుద్ధానుడై తిరిగి లేచే సన్నివేశాలను ప్రదర్శించారు.

రన్ ఫర్ జీసస్

కొందుర్గు: పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఈస్టర్ వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. మండల కేంద్రంలో రన్ ఫర్ జీసస్ పేరిట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. లోకంలోని పాపాల నిమిత్తం ఏసుక్రీస్తు శిలువలో బలయ్యాడని ఈస్టర్ రోజున తిరిగి లేచాడని వివరించారు. ఇందుకు ఈస్టర్ రోజున శాంతిర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఆలయాల్లో భక్తుల కిటకిట



అమ్డాపూర్ రక్తమైసమ్మ ఆలయంలో బారులుతీరిన భక్తజనం

మొయినాబాద్ రూరల్: మండల పరిధిలోని ఆలయాలు ఆదివారం భక్తులతో కిటకిటలాడాయి. మండల పరిధిలోని అమ్డాపూర్ రక్తమైసమ్మ, కనకమామిడి వేంకటేశ్వర స్వామి ఆలయం, సంగమేశ్వర ఆలయం, హిమాయ్‌నగర్‌లోని స్వామి నారాయణ గురుకుల్ లోటస్ టెంపుల్‌లో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం సెలవుదినం కావడంతో భక్తులు దేవాలయాల్లో బారులు తీరారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం

చేవెళ్ల అగ్నిమాపక కేంద్రం అధికారి రవీందర్‌రెడ్డి



యంత్ర పరికరాల ప్రదర్శన నిర్వహిస్తున్న ఫైర్‌స్టేషన్ అధికారులు, సిబ్బంది

చేవెళ్ల: అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చేవెళ్ల అగ్నిమాపక కేంద్రం అధికారి (ఎస్ఎఫ్ఓ) ఎన్.రవీందర్‌రెడ్డి అన్నారు. చేవెళ్లలోని అగ్నిమాపక కేంద్రంలో ఆదివారం అగ్నిమాపకవారోత్సవాల ముగింపు సందర్భంగా కార్యాలయంలో అగ్నిమాప కేంద్రంలో ఉండే యంత్రపరికాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏప్రిల్ 14 నుంచి 20 వరకు నిర్వహించనున్న అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ప్రజలకు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించామన్నారు. వారంరోజుల పాటు పబ్లిక్ స్థలాల్లో, విద్యాసంస్థలు, ఆస్ప త్రులు, బస్‌స్టేషన్, రైల్వేస్టేషన్, పరిశ్రమలు, సినిమా థియేటర్లు, కాలనీలలో ప్రజలకు అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించామన్నారు. చివరి రోజున కార్యాలయంలో ప్రజలకు అగ్నిమాపక కేంద్రంలో ఉండే యంత్రపరికాలు, వాటి ఉపయోగాల గురించి యంత్రాల ప్రదర్శన నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి ఎదైనా అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది ప్రశాంత్‌కుమార్, సాయి, ఎండీ యూనూస్, సురేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాపాలనలో గ్రామాలు అభివృద్ధి



ఎమ్మెల్యే కాలె యాదయ్య సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: ప్రజాపాలనలో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని మల్లారెడ్డిగూడకు చెందిన మాజీ సర్పంచ్ మల్గారి మోహన్ రెడ్డితోపాటు మల్లారెడ్డిగూడ, ఎర్రోనికోటకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో కాలె యాదయ్య వారికి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అన్ని హామీలను అమలు చేస్తోందన్నారు. నూతనతంగా ఏర్పడిన చేవెళ్ల మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. మల్లారెడ్డిగూడకు చెందిన మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి తన అనుచరులు, మల్లారెడ్డిగూడ, ఎర్రోనికోటకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులతో కాంగ్రెస్ చేరటం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, వీరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నర్సింలు ఉన్నారు.

సమాజ సేవకు సమయం వెచ్చించండి

భాగ్యనగర్ విభాగ్ ప్రచారక్ అచ్యుత్

ఇబ్రహీంపట్నం రూరల్: సమాజ సేవకు భారతీయులు అధిక సమయం కేటాయించాలని భాగ్యనగర్ విభాగ్ ప్రచారక్ అచ్యుత్ అన్నారు. ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వీరపట్నం భాగ్ శాఖల సమ్మేళనం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి మంగళ్‌పల్లి సమీపంలోని భారత్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అచ్యుత్ మాట్లాడుతూ.. ఈ దేశం నాది అనే భావనలో జీవిస్తే ఈ దేశపు సమస్యలన్నీ తొలగిపోతాయన్నారు. మన దేశం దైవభూమి, పుణ్యభూమి అని కొనియాడారు. శ్రీరాముడి వారసులమని హిందువుగా జన్మించినందుకు గర్వించాలని చెప్పారు. స్వామి వివేకానంద లాంటి వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లాలని సూచించారు. సంఘ శాఖల ద్వారా సంస్కారాలు, క్రమశిక్షణ అలవడతాయని వివరించారు. సంఘ శాఖలు పెంచేందుకు యత్నించాలన్నారు. ఈ ఏడాది విజయదశమి నుంచి 2026 విజయ దశమి వరకు నిర్వహించే సంఘ శతాబ్ది ఉత్సవాలకు సమయం కేటాయించాలన్నారు. దేశాన్ని ప్రపంచంలో ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంలో మనవంతు కృషి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం భాగ్ కార్యవాహ రమేష్, లింగం, అంజి, మంచాల, యాచారం, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల స్వయం సేవకులు పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్‌కు ప్రత్యేక పూజలు

కడ్తాల్: గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్‌కు ఆదివారం డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా ప్రత్యేక పూజలు చేశారు. సేవాలాల్ జన్మస్థలమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపూర్ జిల్లా గుత్తి మండలం రాంజీ తండాలోని సంత్ సేవాలాల్ ఆలయాన్ని వెంకటేశ్‌గుప్తా ఆధ్వర్యంలో మండలానికి చెందిన పలువురు నాయకులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, రైతు బంధు సమితి జిల్లా సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యులు లచ్చిరామ్‌నాయక్, గోపాల్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ పార్కింగ్‌లకు పాల్పడితే చర్యలు తప్పవు

హస్తినాపురం: అక్రమ పార్కింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని వనస్థలిపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భూపతి గట్టుమల్లు హెచ్చరించారు. విజయవాడ జాతీయరహదారిపై రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నం నేపథ్యంలో హయత్‌నగర్ నుంచి చింతలకుంట వరకు కొంతమేర ట్రాఫిక్‌కు అంతరాయం జరుగుతున్నా ఎప్పటికప్పుడు తమ సిబ్బందితో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూస్తున్నారన్నారు. విజయవాడ, నాగార్జున సాగర్ జాతీయ రహదారులపై ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారని రహదారులపై అక్రమ పార్కింగ్‌లకు పాల్పడితే జరిమానాలు విధిస్తామన్నారు. చాలా ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య లేకుండా చూస్తున్నామని, హస్తినాపురం జిల్లాపరిషత్ రోడ్డులో తెలంగాణ చౌరస్తా నుంచి టీకేఆర్ కమాన్ రోడ్డు వరకు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులకు లేఖ రాశామని వారి సహకారంతో రోడ్లకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

సేవాభావాన్ని పెంపొందించుకోవాలి

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాద్‌నగర్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ప్రతీ ఒక్కరు సేవాభావాన్ని పెంపొందించుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 9వ మల్లికార్జున కాలనీలోని పార్కులో ఆదివారం కాంగ్రెస్ వార్డు ఇన్‌చార్జి గోదా మాధవులు యాదవ్ సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు సేవా భావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. సంపాదించిన దానిలో కొంత మొత్తాన్ని సమాజాభివృద్ధి, పేదల సంక్షేమం కోసం ఖర్చు చేయాలన్నారు. వార్డులో నెలకొన్న సమస్యలను కాలనీ వాసులను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పట్టణాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, నాయకులు కృష్ణారెడ్డి, శ్రీను, కృష్ణ, ప్రవీణ్, జయ ప్రకాష్, మాణిక్యం, వీరేశం, సత్తయ్య, వెంకటేష్ యాదవ్, శ్రావణ్, శ్రీధర్‌గౌడ్, సందీప్, రంజిత్, అక్షయ్, రజిత, జయ, శ్రీకాంత్, మల్లేష్, పాండు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా పండుగలు

నందిగామ: పార్టీలకతీతంగా పండుగలు నిర్వహించుకోవడం అభినందనీయమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని చేగూరులో ఆదివారం మైసమ్మ తల్లి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహ, నాయకులు శ్రీశైలం, ప్రభాకర్, రవీందర్, కృష్ణ, కుమార్, రాజశేఖర్, నర్సింహ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న కేజీరెడ్డి కళాశాల ప్రిన్సిపాల్

మొయినాబాద్: దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి మున్సిపల్ పరిధిలోని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విశ్వేశ్వర్‌రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థుల చదువు సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడాలన్నారు. ఆ దిశగా విద్యార్థులు తమ లక్ష్యాలను ఎంచుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, కళాశాల డైరెక్టర్ రోహిత్ కందకట్ల, ప్రిన్సిపల్ సాయి సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవా సంఘం నూతన కమిటీ



నూతన కమిటీ సభ్యులతో మల్‌రెడ్డి రాంరెడ్డి

తుర్కయంజాల్: బ్రాహ్మణ కుటుంబాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధి కమ్మగూడ టీచర్స్ కాలనీ సాయిగణపతి ఆలయంలో నియోజకవర్గ బ్రాహ్మణ సేవా సంఘం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్‌రెడ్డి రాంరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మోహన్ రావు, ప్రధాన కార్యదర్శి రాఘవేందర్ రావు, కోశాధికారి వెంకటేశ్వర రావు, ఉపాధ్యక్షులుగా గోవర్ధన్‌రావు, వసంతరావు, వెంకటశివ కుమార్, రుక్మిణి, సహాయ కార్యదర్శులుగా రాధిక, శివ రామారావు, కార్యనిర్వాహక కార్యదర్శి వెంకటేశ్వర రావు, కార్యవర్గ సభ్యుడిగా గౌతరాజు రఘురాంను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ లీడ్ క్యాప్ చైర్మన్ తులసి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నీరు రాదు.. సమస్య తీరదు

నిరుపయోగంగా వాటర్ ట్యాంకు

- నీరు నింపాలని కోరుతున్న స్థానికులు



వృథాగా మారిన ట్యాంకును చూపుతున్న ప్రజలు

మొయినాబాద్ రూరల్: హిమాయత్‌నగర్‌లోని పూడూరు కాలనీలో నిర్మించిన తాగునీటి ట్యాంకు నిరుపయోగంగా మారింది. సిబ్బంది నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో ఈ ట్యాంకు దిష్టిబొమ్మలా మారింది. హిమాయత్‌నగర్ రహదారి చిలుకూరు బాలాజీ ఆలయానికి వెళ్లే మార్గంలో మాజీ సర్పంచ్ తాగునీటి సరఫరా కోసం ఈ ట్యాంకు నిర్మించారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో దాదాపు ఏడాదిన్నర కాలంగా సమస్యను పట్టించుకునే వారే కరువయ్యారు, మిషన్ భగీరథ నీటి సరఫరా సైతం నామమాత్రంగానే ఉండడంతో స్థానికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి కృషి



హిమాయత్‌నగర్‌లో పూడూరు బస్తీకి తాగునీటి సమస్య ఉందని సమాచారం అందింది. ఈ సమస్యను తీర్చేందుకు ఉన్నతాధికారులతో చర్చిస్తాం. మినీ ట్యాంకును, బోరు మరమ్మత్తులు చేసి నీరు నింపేందుకు కృషి చేస్తున్నాం. త్వరలో తాగునీటికి సమస్యను పరిష్కరిస్తాం.

– సంధ్యారాణి, మున్సిపల్ అధికారి